

ఓం నమో భగవతే శ్రీరమణాయ



# రమణ భాస్కర

## (భీమవరంలో శ్రీనాన్నగారి ప్రవచనము, 1-4-98)

**ప్రియమైన ఆత్మబంధువుల్లారా,**

ప్రపంచం మనకు ఉన్నదానివలె కనిపిస్తోంది. మనలో ఒకడు ఉండి ఇంద్రియాల ద్వారా ఈ ప్రపంచాన్ని చూస్తున్నాడు, వాడినే మనస్సు అని, జీవుడు అని అంటున్నాము. ఈ విశాలసృష్టిని నిర్మించి, జీవకోటిని వారి వారి కర్మానుసారం నడిపేవాడిని ఈశ్వరుడు అంటున్నాము. మనచేత చూడబడే లోకం గురించి, ఈ లోకానికి ఆధారంగా ఉన్న పరమేశ్వరుడి గురించి, మనలో ఏదైతే నేనుగా వ్యక్తమవుతోందో ఆనేను గురించి వీటికి ఉన్న పరస్పర సంబంధం గురించి చెప్పేదే వేదాంతం. మనస్సే మనకు నేనుగా వ్యక్తమవుతోంది. ఆ నేనుకు మూలం బయటలేదు నీలోపలే ఉంది అని మీరు చెపుతున్నారు. ఈ నేనును అక్కడకు పంపించి, అక్కడ దానిని ఉంచగలిగితే ఇతర తలంపులు అణగిపోతాయి అని మీరు అంటున్నారు. మీరు చెప్పారు కదా అని నేను అభ్యాసం ప్రారంభించాను అని ఒక భక్తుడు భగవాన్‌తో చెపుతున్నారు. నేను అభ్యాసం చేస్తూ ఉంటే ఏదో కొంతదూరం వెలుతోంది గాని దాని మూలంలోనికి అది వెళ్లటంలేదు. మరి దీనికి ఉపాయం ఏమిటి అని భగవాన్‌ను ప్రశ్నించారు. మనస్సును దాని మూలంలోనికి పంపటానికి ప్రయత్నంచేస్తున్నాను కాని అది వెళ్లటం లేదు అని మీరు అంటున్నారు. అక్కడకు వెళ్లకుండా ఎవరు అడ్డువస్తున్నారు అని భగవాన్ అడిగారు. నా అలవాట్లు వాసనలు అడ్డువస్తున్నాయి, వాటిని తొలగించుకొని నా అంతట నేను బయటకు వస్తాననే ధైర్యం కూడా సరిపోవటం లేదు, నా సాధనా బలం సరిపోవటంలేదు. ఈశ్వరానుగ్రహం ఉంటేనేగాని ఇందులో నుండి బయటకు రాలేను అని తెలుస్తోంది అని ఆ భక్తుడు అన్నారు. అనుగ్రహం అనేది ఈశ్వరుడికి సంబంధించినది. ముందు నీ గొడవ మాట్లాడు అన్నారు భగవాన్. నీవు చేయవలసిన ప్రయత్నం హృదయపూర్వకంగా చేస్తే అదే ఈశ్వరానుగ్రహంగా మారి నీకు సహకరిస్తుంది. నీవు నిర్మలంగా ఉండి నిశ్చయాత్మక బుద్ధితో ప్రయత్నం చేస్తే అనుగ్రహం వస్తుంది, నీవు పొందవలసినది పొందుతావు అన్నారు భగవాన్.

పూజ, జపం, ధ్యానం ఎందుకు చేస్తున్నామో మనకు తెలియదు. వీటి వలన మన జీవితం పరిశుద్ధం కాకపోతే వీటివలన ప్రయోజనం లేదు, పుణ్యం వస్తుంది గాని అది అనుభవిస్తే పోతుంది. మరల జన్మ సిద్ధం. సగుణం, సాకారం మానవుడి మనస్సును బాగా ఆకర్షిస్తుంది. మనకు దేహాభిమానం ఉన్నంతవరకు ఉపాసన తప్పదు. మీ మనస్సును తీసుకొని వెళ్ళి నిరాకారం మీద ఉంచటం చాలా కష్టం. ఆత్మవైభవం తెలియటంకోసం కావలసిన సామాగ్రిలో భక్తి చాలా ముఖ్యం. సత్యం అంతటా వ్యాపించి ఉన్నప్పటికి నీవు సజ్జనుడవు కాకపోతే సత్యం నీకు తెలియదు. నీవు మాట్లాడేమాట, నీవు

తీసుకొనే ఆహారం, నిద్ర నీసాధనకు అనుగుణంగా ఉండాలి. అతిగా ఉంటే తమోగుణం వస్తుంది. కొంతమంది మేము ఏదో సంపాదించుకొంటున్నాము, ఏదో తింటున్నాము అనే గొడవలోనే ఉంటారు, ఇంకో గొడవ ఉండదు, వారికి జ్ఞానమా? కొంత మంది దేవుని నామాన్ని జపిస్తూ ఉంటారు కాని ఎర్రచీమ కుడితే తట్టుకోలేరు ఎవరైనా చిన్నమాట అంటే భరించలేరు. అంటే నోటితో పలుకుతున్నారుగాని విషయం వారికి అనుభవంలో లేదు. మనం కొంతమందిని ద్వేషిస్తాము. ఆ ద్వేషిస్తున్న వారి హృదయంలో కూడా భగవంతుడు ఉన్నాడు. అంటే మనం భగవంతుడిని ద్వేషిస్తున్నట్లే. మీరు మనస్సుకు ఎదురు పడవద్దు అని భగవాన్ చెప్పారు. మనస్సు యొక్క వేగం ముందు నీసాధన సరిపోదు, నీ సాధనను అది తినేస్తుంది. దాని గొడవలోనికి వెళ్లకు, దానిని పట్టించుకోవద్దు. మనస్సును నిర్లక్ష్యంగా చూడు అన్నారు భగవాన్. నిద్రలో లోకం, మనస్సు, దేహం దుంగలుగా పడిఉన్నాయి. ఈ మూడు లేకుండా నీవు హాయిగా సుఖంగా ఉన్నావు. అంటే లోకం, మనస్సు దేహం లేకుండా మనం ఉండగలము.

జ్ఞాని కూడా భక్తుడే. జ్ఞానిలో నిష్కామ భక్తి, నిష్కామకర్మ పూర్ణంగా ఉంటాయి. సకామభక్తి కూడా భక్తే. ఇలా కొన్ని జన్మలు చేయగా సకామభక్తి నిష్కామభక్తిగా మారుతుంది. నిష్కామభక్తి వలన ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. ఆత్మ ఉందా అని అడిగితే ఉన్నదే అది అనేవారు భగవాన్. మిగిలినవి అన్నీ నీరజోగుణం కారణంగా ఉన్నవానివలె కనిపిస్తున్నాయి. నీవు పొందవలసిన విషయం గురించి ప్రయత్నించు. నీకు ఏది కావాలో దాని కోసం ప్రయత్నించు. నీవు కాని విషయాల జోలికి వెళ్ళవద్దు, వాటిని గెంటివెయ్యి. మౌనం కూడా బోధిస్తుంది. గంటల తరబడి ప్రసంగాలు చేసి, అనేక గ్రంధాలు వ్రాసి సాధకుడికి వ్యక్తం చేయలేని అనుభవాన్ని ఒక మహాజ్ఞాని క్షణకాలంలో తన మౌనం వలన సాధకుడి హృదయంలో జ్యోతిని ప్రజ్వలన చేస్తాడు. అది జ్ఞాని యొక్క వైభవం. అహంకార రహిత జీవితం వలన సత్యం తెలియబడుతుందిగాని ఏదో కొద్ది టైము జపం చేసినంత మాత్రం చేత సత్యం తెలియదు. నీకు తెలియని బలహీనతల గురించి ఆలోచించకు. నీకు కొన్ని బలహీనతలు తెలుస్తున్నాయి కదా వాటిని తొలగించుకోవటానికి హృదయపూర్వకంగా ప్రయత్నిస్తే నీకు తెలియకుండా ఉన్నవాటిని ఈశ్వరుడే తొలగిస్తాడు. నీ లోపల ఏమైనా బరువైనా దుంగల వంటి బలహీనతలు ఉన్నా ఈశ్వరానుగ్రహంలో కొట్టుకొనిపోతాయి.

ఈ శరీరం పోయిన తరువాత మనకు ఇంకో శరీరం వస్తుంది. ఎందుచేతనంటే మనకు ఇంకా లోకం మీద ప్రీతిపోలేదు. లోకం లోనికి అతిగా వెళ్ళవద్దు. అవసరం లేని విషయాలలోనికి వెళ్ళి ప్రమాదం తెచ్చుకోవద్దు. దేహయాత్రకు సంబంధించిన పనులు చేసుకోండి. మిగతా సమయాన్ని ఆత్మను తెలుసుకోవటానికి వినియోగించండి, జన్మరాహిత్య స్థితిని పొందటానికి ప్రయత్నం చేయండి. కేవలము ఇంద్రియగతమైన జీవితంతో సంతృప్తిపడే వాడికి భక్తి ఏమిటి? పరమార్ధం ఏమిటి? దైనందిన జీవితంలో మన ప్రవర్తన అహంభావనరహితంగా ఉండాలి. అప్పడు అహంభావన దానంతట అదే వాడిపోయి రాలిపోతుంది. ఏయోగం అవలంభించినా అహం వృత్తిలో నుండి బయట పడాలి అన్నారు

భగవాన్. అహంకారముతో కూడిన మాటలు, పనులు, స్నేహాలు అన్నీ పేకముక్కల కోటలాంటివి, అవి నిలబడేవికాదు, గాలి వేస్తే పోతాయి. నిన్ను వ్యవహారం విడిచిపెట్టి ఎక్కడికో వెళ్ళిపొమ్మని చెప్పటం లేదు. దైనందిన జీవితంలో నీ వ్యవహారం అంతా రాగద్వేషరహితంగా ఉండాలి. అప్పుడు నీకు అంతర్ దృష్టి కలుగుతుంది. అంతర్దృష్టి కలిగిన వాడికి ఆత్మానుభవం పొందాలనే కాంక్ష ఉబికి, ఉబికి వస్తుంది. అప్పుడు ఆత్మానుభవం పొందటం కాదు పొందకుండా ఉండలేడు. మహాత్ముల సాంగత్యం వలన నీకు ఆత్మానుభవం ఒక్కసారి స్ఫురిస్తుంది. కర్మయోగి చేసేపని కళ్ళకు కనబడుతూ ఉంటుంది, జ్ఞానయోగి చేసేపని కళ్ళకు కనబడదు. అందువలన ఏమి చేయటం లేదు అని నీకు అనిపిస్తుంది. అందుచేత లోకం కర్మయోగులకు ఇచ్చిన గౌరవం జ్ఞాన యోగులకు ఇవ్వదు. నీ మాట కంటే, చేతకంటే, నీ తలంపుకంటే మౌనంకు ఎక్కువ శక్తి ఉంది. అది నీకు తెలియదు. మహా జ్ఞాని యొక్క మౌనం నీ జీవిత విధానాన్ని మార్చేస్తుంది. మౌనం అంత శక్తివంతమైనది. స్థూలబుద్ధి ఉన్నవాడికి మాటలు చెప్పాలి, సూక్ష్మ బుద్ధి ఉన్నవాడికి మౌనం సరిపోతుంది ఏ విషయాన్ని అయినా మనస్సును పెట్టుకొని చూస్తున్నావు. అందువలన విషయం సరిగా అర్థంకాదు. ఆమనస్సును చింపేస్తే యోగివిఅవుతావు. నిన్ను ప్రేమించిన వారిని ప్రేమిస్తున్నావు. అది లౌకికులు కూడా చేస్తున్నారు. నీవు భక్తుడవు అయి ఉండి నిన్ను ప్రేమించని వారిని కూడా ప్రేమించకపోతే ఎలాగా? నిన్ను ప్రేమించని వారిని ప్రేమించకపోతే నీవు భక్తుడవు ఎలా అవుతావు.

ముకుందమాలలో సంసారసముద్రం ఎలా ఉంటుందో చెప్పాడు. సముద్రంలో గాలి, అలలు, ఉంటాయి. సంసారసముద్రంలో నీ కోరికలే గాలి, రాగద్వేషములు అలలు. ఇక సముద్రంలో సుడిగుండాలు ఉంటాయి. సంసారసముద్రంలో భార్యకి భర్త సుడిగుండం, భర్తకి భార్య సుడిగుండం. ఆసుడిగుండంలో పడినవాడు బయటకు రాలేడు. గురువుతో మానసిక అనుబంధం లేకపోతే మనకు ప్రేమ ఉదయించదు. ద్వేషంతో లోకాన్ని జయించలేము గాని ప్రేమతో లోకాన్ని జయించవచ్చు. నిష్కామ కర్మ చేసేవాడు, నిష్కామ భక్తి ఉన్నవారు ఈలోకంలో చిరంజీవులే. నేను మీ హృదయంలో ఉన్నాను అనుకోండి. మీరు నాహృదయంలో ఉన్నారు అనుకోండి ఇంక ఈ బొమ్మలతో పని ఏముంది. బొమ్మలు ఉండవద్దు, లేకపోవచ్చు. ఈ బొమ్మలతో మనకు పనిలేదు. ఈ విషయాన్ని గ్రహించే బుద్ధి ఉండాలి. భగవంతుడు ఏ స్థాయిలో ఉండి చెపుతున్నాడో ఆ స్థాయికి ఎదిగితేగాని అది మనకు అర్థంకాదు. నిరంతరము మన మనస్సు మనలను వంచన చేస్తూ ఉంటుంది. నీవు మంచివాడివికాకపోయినా నీవు మంచివాడివే అని మనస్సు చెపుతూ ఉంటుంది. ఎవడి మనస్సు వాడిని ఇలా వంచిస్తూ ఉంటుంది. నీకు అర్హత లేకపోయినా, యోగ్యత లేకపోయినా జ్ఞానాన్ని ఇంకా భగవంతుడు నీకు ఇవ్వలేదు అని మనస్సు వంచన చేస్తూ ఉంటుంది. దేవుని అనుగ్రహం లేదు అని అనుకోవద్దు. అనుగ్రహం పొందటానికి నీమనస్సును తయారుచెయ్యి. పూజచెయ్యి, జపంచెయ్యి, ధ్యానం చెయ్యి భగవంతుడు ఏ అవకాశం ఇస్తే ఆ అవకాశం సద్వినియోగం చేసుకో. అప్పుడు నీమనస్సు తయారవుతుంది. నీమనస్సు తయారయితే దేవుని అనుగ్రహం పొందటానికి దానికి అర్హత

వస్తుంది. నీ అర్హతనుబట్టి దానిని పొందుతావు. సంసారం విడిచిపెట్టి, వ్యవహారం విడిచిపెట్టి ఎక్కడికో పారిపొమ్మని రమణాచార్యుడు చెప్పటం లేదు. నీ వ్యవహారం నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, రాగ ద్వేషరహితంగా ఉండాలి, నిరహంకారంగా ఉండాలి. అప్పడు ఇహాన్ని సాధిస్తావు, పరాన్ని సాధిస్తావు.

భగవాన్‌తో ఒకరు నేను కొన్ని పొరపాట్లు చేసాను అని చెపుతారు. నీవు పొరపాట్లు చేసినా నీవు పవిత్రుడవే అన్నారు భగవాన్. అదేమిటి స్వామి నేను పొరపాట్లు చేసాను అని చెపుతున్నాను కదా నీవు పవిత్రుడవే అంటారు ఏమిటి అన్నాడు. అప్పడు భగవాన్ నీవు ఎవడవు? నీవు ఆత్మవు. ఆత్మ ఎప్పడూ పవిత్రంగానే ఉంటుంది అనిచెప్పారు. అంతేగాని నీవు పొరపాట్లు చేసాను అంటున్నావు అయితే నీవు పాపివి, నీవు ఎందుకు పనికిరావు అని నెగిటివ్‌గా చెప్పే అలవాటు ఆయనకు లేదు అంతా పోజిటివ్‌గానే చెపుతారు. నీ మనస్సు పొరపాటు చేసింది. నీవు మనస్సు కాదుకదా. నీవు మనస్సు అనుకొన్నప్పడూ నీవు ఆత్మవే. నీమనస్సు పొరపాటు చేసినప్పడు నీవు ఆత్మవే. అందుచేత నీవు ఎప్పడూ పవిత్రుడవే. మనిషిని ఎక్కడికి తీసుకొని వెళుతున్నాడో చూడండి. గురువు యొక్క మౌనం నిన్ను అనుగ్రహిస్తుంది. ఏదినిజమో, ఏది నిజంకాదో, దేనిని పొందాలో దేనిని విడిచిపెట్టాలో అని లోపల నుండి ఉపదేశం ఇస్తుంది, మార్గం చూపిస్తూ ఉంటుంది. శివుడు వచ్చి మీకు అన్నం తినిపించాడు అనుకోండి ఇది చాలా గొప్ప విషయం అని మీకు అనిపిస్తుంది. నీకు అన్నం తినిపిస్తాడు, వెళ్ళి పోతాడు దాని వలన నీకు జ్ఞానం వచ్చేసిందా? బాహ్యమైన చమత్కారాల కోసం, అనుభవాలకోసం చూడవద్దు. అనుభవం నీలోపల కలగాలి. బాహ్యమైన అనుభవాలకోసం నీమనస్సు సరదా పడుతోందిగాని పొందవలసిన వస్తువును పొందటంకోసం మీ మనస్సు వేగిరపడటం లేదు. ఆ వస్తువును పట్టుకోవటానికి అనుకూలమైన సంకల్పాన్ని నీకు గురువుయొక్క మౌనం బోధిస్తుంది. ఏ వస్తువును నీవు పొందాలో ఆవస్తువును పొందటం కోసం, ఆవస్తువు దగ్గరకు తీసుకొని వెళ్ళటంకోసం గురువు యొక్క మౌనం నిన్ను నిరంతరము అనుగ్రహిస్తూనే ఉంటుంది. మరల ఎక్కడపుడతాము అని ఆలోచించవద్దు. ఈ శరీరంలో ఉండగానే చనిపోయి మరల ఈశరీరంలో పుట్టు నీకు జ్ఞానం కలుగుతుంది అన్నారు భగవాన్.

# గురుపూర్ణిమ

## (జిన్నూరులో శ్రీనాన్నగారి ప్రవచనము, 9-7-98)